ఇష్టారాజ్యం..!



- హోటళ్లలో నాణ్యత లేని భోజనం, ఫలహారాలు
- సొంత పనులకు వచ్చే వారి నుంచి టోల్ వసూలు
- ఇష్టారీతిన వ్యవహరిస్తున్న నిర్వాహకులు
- మహానంది క్షేత్రంలో భక్తులు, సామాన్యులకు తప్పని ఇక్కట్లు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న దేవస్థాన అధికారులు

నంద్యాల, జులై 8 (ఆంధ్రజ్యోతి)/మహానంది : మహానంది దేవస్థాన పరిధిలో కొంత మంది లీజుల పేరిట ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారా? వారి తీరుతో దేవస్థానానికి వచ్చే భక్తులే కాకుండా సొంత పనుల కోసం మహానందికి వచ్చేవారు కూడా ఇబ్బందుల పాలవుతున్నారా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇక్కడకు వచ్చే భక్తులకు హోటల్, టోల్‌గేటు నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారు. దైవదర్శనానికి వచ్చే భక్తులు ఆకలి తీర్చుకునేందుకు హోటళ్లకు వెళితే నాణ్యత లేని ఆహార పదార్థాలు పెడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు భక్తులు గొడవకు దిగినా హోటళ్ల నిర్వాహకుల తీరులో మార్పు కనిపించడం లేదు. ఇక్కడి టోల్‌గేట్ నిర్వాహకుల తీరు కూడా వివాదాస్పదంగానే ఉంది. మహానంది మండల పరిధిలోని గ్రామాల వారు, మహానంది మండల కేంద్రంలో విధులు నిర్వహించే ఉద్యోగులు తమ సొంత పనుల కోసం వస్తున్న వారి నుంచి కూడా టోల్ రుసుము వసూలు చేస్తున్నారు. వీరి తీరుతో స్థానికులు, ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పట్టించుకోవాల్సిన దేవస్థాన అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, సామాన్యులు మండిపడుతున్నారు.

నాణ్యత లేమితో భక్తులకు ఇక్కట్లు..

మహానందికి వచ్చే భక్తులు ఆహారం కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో దేవస్థానం స్థానికంగా హోటళ్ల ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. దేవస్థానం పరిధిలో మూడు హోటళ్లు ఉన్నాయి. వీటిలో దేవస్థానం ముందు ఓ హోటల్ ఉంది. భక్తులు ఎక్కువగా ఈ హోటల్‌కే వస్తుంటారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చే భక్తుల అవసరాన్ని అదనుగా తీసుకుని హోటల్ యజమానులు నాణ్యతలేని భోజన, ఫలహారాలను అందిస్తుంటారన్న విమర్శలు ఉన్నాయి. ఆహారం సరిగా లేదన్న విషయమై పలుమార్లు భక్తులు హోటల్ యాజమాన్యంతో గొడవలు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. భక్తులకు సరైన ఆహారం అందించకుండా నిర్లక్ష్యం వహించిన హోటల్ నిర్వాహకులకు దేవస్థానం గతంలో హోటల్ నోటీసులు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. నాణ్యమైన ఆహారాన్ని అందించడం లేదని కొంతమంది భక్తులు గతంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులకు కూడా ఫిర్యాదులు చేశారు. ఇలా ఫిర్యాదు చేసిన సందర్భాల్లో సంబంధిత అధికారులు హోటల్‌పై తూతూమంత్రంగా తనిఖీలు జరిపి వదిలేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అటు దేవస్థాన అధికారులు, ఇటు ఫుడ్‌సేఫ్టీ అధికారులను తమ గుప్పిట్లో ఉంచుకున్న హోటల్ నిర్వాహకులు, భక్తులకు నాణ్యతలేని ఆహారాన్ని అందించి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో పాటు ఉన్న మిగతా రెండు హోటళ్ల పరిస్థితి కూడా ఇంతకంటే మెరుగ్గా ఏమీ లేదన్న అభిప్రాయం ఉంది. ఇక ఈ మూడింటికి ఫుడ్‌సేఫ్టీ అనుమతులు లేనట్లు తెలుస్తోంది.

ఏ ఎండకు ఆ గొడుగు

దేవస్థానం ముందు ఉండే హోటల్ నిర్వాహకుడు ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ తన పబ్బం గడుపుకుంటున్నాడన్న విమర్శలు ఉన్నాయి. మొన్నటి వరకు గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధితో అంటకాగి, ఎన్నికలకు కొద్ది రోజుల ముందు టీడీపీలో చేరాడు. ఇక టీడీపీ అధికారంలోకి రాగానే గెలిచిన ప్రజా ప్రతినిధిని వద్దకు వెళ్లి హోటల్ లీజు కోసం చెల్లించాల్సిన రుసుము చాలా ఎక్కువగా ఉందని, బాగా తగ్గించే ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిసింది. హోటల్ నిర్వాహకుడి వ్యవహారం ముందే తెలిసిన సదరు ప్రజా ప్రతినిధి హోటల్ లీజు కోసం ఇచ్చే సొమ్ము దేవుడికి వెళతుందని, ఆ విషయంలో తాను కలుగజేసుకోలేనని కరాఖండిగా చెప్పినట్టు సమాచారం. దీంతో హోటల్ నిర్వాహకుడు చేసేదేమీ లేక దేవస్థానం నిర్ణయించిన సొమ్మును చెల్లించి మళ్లీ లీజుకు తీసుకున్నాడు. ఇక టోల్ నిర్వాహకులకు సైతం వైసీపీ నేతలతో మంచి సంబంధాలు ఉన్న కారణంగానే ఇష్టారీతిన వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి.

టోల్ తీస్తారు..

సాధారణంగా ఆయా దేవస్థానాల పరిధిలో టోల్‌గేట్లను ఏర్పాటు వాహనాల నుంచి రుసుం వసూలు చేస్తుంటారు. ఈ టోల్ వసూలు నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు ఆయా దేవస్థానాలు లీజుకు ఇస్తాయి. మహానంది దేవస్థానం కూడా టోల్ గేటు నిర్వహణను లీజుకు ఇచ్చింది. సాధారణంగా దేవస్థానానికి వచ్చే వాహనాల నుంచే టోల్‌గేటు రుసుము వసూలు చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడి టోల్‌గేటు నిర్వాహకులు మాత్రం తమ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మహానంది దేవస్థానం మాత్రమే కాకుండా, మండల కేంద్రం కూడా కావడంతో ఇక్కడే పోలీసు స్టేషను, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయ కళాశాల, ఉద్యాన పరిశోధన కేంద్రం, ఒంగోలు జాతి పశుపోషణ కేంద్రం ఉన్నాయి. పని నిమిత్తం ఆయా కార్యాలయాలు, పోలీసు స్టేషనుకు వచ్చేవారు ఈ టోల్‌గేటు దాటి రావాల్సిందే. ఇదే అదునుగా టోల్ గేటు నిర్వాహకులు ఇలా వచ్చే వారి నుంచి కూడా రుసుమును వసూలు చేస్తున్నారు. తాము స్థానికులమేనని, పని నిమిత్తం మహానందికి వచ్చామని చెప్పినా.. అదేమీ తమకు తెలియదని, డబ్బులు చెల్లించాల్సిందేనంటూ ఇక్కడకు వచ్చే వారి నుంచి టోల్ రుసుమును ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అంతేగాకుండా ఆయా కార్యాయాలకు వచ్చే ఉద్యోగుల వాహనాలకు కూడా కొద్ది రోజులు టోల్ రుసుమును వసూలు చేశారు. ఈ విషయమై గతంలో ఉద్యోగులు, టోల్ నిర్వాహకులకు మధ్య వాగ్వాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే.. లక్షలు పెట్టి టోల్‌గేటు నిర్వహణను సొంతం చేసుకున్నామని, రుసుము వసూలు చేయకపోతే తాము నష్టపోతామని వాదిస్తున్నారు.

కొత్తగా బాధ్యతలు చేపట్టాను

మహానంది క్షేత్ర పరిధిలోని టోల్‌గేట్ నిర్వాహకుల వ్యవహారంతోపాటు హోటల్స్‌పై నాకు ఇంకా ఎలాంటి సమాచారం లేదు. మహానంది ఆలయ ఇన్‌చార్జిగా ఈవోగా మాత్రమే నేను వ్యవహరిస్తున్నాను. ఇటీవలనే ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టాను. పూర్తి స్థాయి బాధ్యతలు కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈవోగా విధులు నిర్వహిస్తున్నాను. మహానంది ఆలయ పరిపాలనపై నాకు పూర్తి స్థాయిలో అవగాహన లేదు. టోల్‌గేట్ నిర్వాహకులు, హోటళ్ల యజమానులతో త్వరలో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకుంటాను.

\- ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి



దేవస్థానం టోల్‌గేటు

అధికారం ఉన్నవారితో అంటకాగుతూ..

హోటల్‌లో నాణ్యమైన భోజనం అందించకపోయినా, టోల్‌గేటు నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా దేవస్థానం అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇక్కడ లీజుదారులు రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండటంతోనే దేవస్థాన అధికారులు, సంబంధిత అధికారులు ఏమీ చేయలేకపోతున్నట్లు తెలుస్తోంది. భక్తులకు నాణ్యమైన ఫలహారం అందించడం లేదన్న విషయంలో గత ఈవో హోటళ్లకు కొన్ని సార్లు నోటీసులు జారీ చేయగా అప్పటి వైసీపీ ప్రజా ప్రతినిధి చేత చూసీ చూడనట్లు వ్యవహరించమని ఫోన్ ద్వారా చెప్పించినట్లు సమాచారం. ఇక హోటళ్లపై భక్తులు ఫిర్యాదులు చేసిన సమయంలో తనిఖీలకు వచ్చిన సంబంధిత అధికారులను తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి మేనేజ్ చేసి పంపించారని సమాచారం. దేవస్థానం అందించే ఉచిత భోజన సదుపాయానికి సైతం ఫుడ్‌సేఫ్టీ అనుమతులున్నా, హోటళ్లకు అలాంటి అనుమతులు ఏవీ లేకపోవటం గమనార్హం. అయినా హోటళ్లు ఎలాంటి అడ్డంకులు లేకుండా సజావుగా సాగుతున్నాయంటే.. వాటి నిర్వాహకులకు రాజకీయ పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



దేవస్థాన పరిధిలో ఉన్న ఓ హోటల్

వెంకటనాయునిపల్లెలో ఉద్రిక్తత

- పలువురు ఇళ్లపై ఓ వర్గం దాడులు
- టీవీలు, బైకులు ధ్వంసం
- ఓ ఇంటికి నిప్పు

డోన్, జూలై 8: పొలం గట్టు తగాదా కారణంగా డోన్ మండలంలోని వెంకటనాయునిపల్లెలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం ఉదయమే ఓ వర్గం వారు పలువురి ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. బైకులు ధ్వంసం చేయడంతోపాటు ఓ ఇంటికి నిప్పు పెట్టారు. దీంతో ఒక్కసారిగా గ్రామంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మండలంలోని వెంకటనాయునిపల్లెలో మాజీ సర్పంచ్ మాదయ్యకు ప్రకాష్‌నాయుడులకు పొలం గట్టు విషయంలో ఎన్నో ఏళ్లుగా తగాదా నడుస్తోంది. ఈ తగాదాతో ఇరువర్గాల మధ్య మనస్పర్థలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఆదివారం రాత్రి పొలం తగాదా గట్టు కారణంగా చెన్నయ్య నాయుడు, ప్రకాష్ నాయుడు, ప్రభాకర్ నాయుడు, రంగన్న నాయుడు, వెంకటరమణమ్మ, మహేశ్వరి, లక్ష్మీదేవి వేటకొడవళ్లు, కత్తులు, కట్టెలు, వేటు కొడవళ్లతో మాజీ సర్పంచ్ మాదయ్యపై మూకుమ్మడిగా దాడి చేశారు. మాదయ్య తీవ్రంగా గాయపడడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి సోదరుడు రామాంజనేయులు, అతని అనుచరులు సోమవారం ప్రత్యర్థుల ఇళ్లపై దాడికి దిగారు. చెన్నయ్య నాయుడు, ప్రకాష్‌నాయుడు ఇళ్లలోకి దూరి టీవీలు, వంట సామగ్రిని ధ్వంసం చేశారు. ఇంటి బయట ఉన్న రెండు బైకులను ధ్వంసం చేశారు. అదేవిధంగా ప్రకాష్ నాయుడు ఇంటికి నిప్పు పెట్టారు. ఈ దాడులతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పేశారు.



వెంకటనాయునిపల్లె దాడిలో ఇంటికి పెట్టిన నిప్పు





ధ్వంసమైన బైక్, టీవీ



మంటలను ఆర్పుతున్న పోలీసులు

వెంకటనాయుని పల్లెలో పికెట్

దాడుల నేపథ్యంలో వెంకటనాయునిపల్లెలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు.

వలస నేతల అత్యుత్సాహం..!

- టీడీపీలో జంప్ జిలానీల హడావుడి
- కోరుమానుపల్లె ఘటనే ఇందుకు నిదర్శనం
- పార్టీకి చెడ్డపేరు వస్తుందని వాపోతున్న తమ్ముళ్లు

కొలిమిగుండ్ల, జూలై 8: టీడీపీలో వలస నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల ముందు వరకు వైసీపీలో అధికారం చెలాయించి ఎన్నికల సమయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీలో ఎలా ప్రవర్తించారో టీడీపీలోకి వచ్చాక కూడా అదే తీరున వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా బనగానపల్లె నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎన్నికల అనంతరం జరిగిన ఘటనలు అత్యధికంగా వలస నాయకులు సృష్టించినవేనని టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. వైసీపీలో చేసిన అత్యుత్సాహమే తమ పార్టీలో ప్రదర్శిస్తున్నారని, దీంతో తమ పార్టీకి చెడ్డపేరు వచ్చేలా ఉందని అసలైన టీడీపీ నేతలు ఆవేదన చెందుతున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన వివాదాస్పద ఘటనలకు వలస నాయకులే కారణమన్నది టీడీపీ నాయకుల వాదన. ప్రధానంగా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన కోరుమానుపల్లె ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిని దూషించి దురుసుగా ప్రవర్తించిన విజయ్ భాస్కరరెడ్డి సార్వత్రిక ఎన్నికల పది రోజుల ముందు టీడీపీలో చేరారు. ఈయన ఉపాధ్యాయుడిని దూషించిన వీడియో పార్టీకి చెడ్డపేరు వచ్చేలా ఉంది. ఈ ఘటన పట్ల రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి సీరియస్‌గా స్పందించారు. ఉపాధ్యాయుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. వలస వచ్చిన నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీడీపీ శ్రేణులు కోరుతున్నాయి.



ప్రాణహాని జరిగే వరకు చర్యలు తీసుకోరా..?

అరటి తోటల్లో చిరుత పులి సంచారం

మహానంది, జూలై 8: చిరుతపులి ద్వారా ప్రాణహాని జరిగే వరకు చర్యలు తీసుకోరా అంటూ అటవీశాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణిపై మండల ప్రజలు, రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. మహానంది మండలం బుక్కాపురం సమీపంలోని అరటి తోటల్లో సోమవారం ఉదయం చిరుతపులి సంచరించి వెళ్లింది. పాదముద్రలు చూసిన ఆయా తోటల రైతులు పులి వచ్చినట్టు గుర్తించారు. ఇక చిరుత రూటు మార్చుకొని నల్లమల అడవి పరిసరాలు వదలి పంటపొలాల్లో సంచరించడం మొదలు పెట్టడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు.. తమకు ప్రాణహాని తథ్యమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా మహానంది క్షేత్ర పరిసరాల్లో సంచరించిన చిరుత పంట పొలాల దారి పట్టడంతో రైతులు, కూలీలు బిక్కు బిక్కుమంటూ కాలం గడిపే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు చిరుతను బంధించి జూకు తరలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మహానంది గోశాల వద్ద చిరుతపులి సంచారం(ఫైల్)

పేదలకు అందుబాటులో ఇసుక: మంత్రి

నంద్యాల (నూనెపల్లె), జూలై 8: పేద మధ్య తరగతి ప్రజల కోసమే ఇసుకను అందిస్తున్నట్లు రాష్ట్రమంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో ఉచిత ఇసుక విధానం అమలులో భాగంగా నంద్యాల నియోజకవర్గంలో ఉచిత ఇసుక పథకాన్ని ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. నిర్వహణ ఖర్చుల కోసం నామినల్ ధరలు, రవాణా, లోడింగ్ చార్జీలు మాత్రమే వసూలు చేయనున్నట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో ఇసుక భారంగా మారిందని వాటిని మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఉచిత ఇసుక పథకాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయమని దీంతో సామాన్యులకు భారీ ఊరట లభిస్తోందని పేదల సొంతింటి కళ నెరవేరబోతోతందని ఆయన అన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ



మంత్రి ఫరూక్‌ను కలిసిన మాల మహానాడు నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 8: నంద్యాల టీడీపీ కార్యాలయంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు సోమవారం వినతులు వెల్లువెత్తాయి. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని ఫరూక్‌ను కోరారు. రైల్వే స్టేషన్ వద్ద ఉండే చిరు వ్యాపారులు వారి సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని కోరారు. వీరితో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజా సంఘాల నాయకులు మంత్రి ఫరూక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

'మహాసభలను జయప్రదం చేయాలి'



ఏపీటీఎఫ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జూలై 8: విజయనగరంలో అక్టోబరులో జరిగే 20వ విద్యవైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవ స్వామి నగిరి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం నంద్యాలలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏపీటీఎఫ్ నాయకులు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల కరపత్రాలను మంత్రి ఫరూక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు గోపాలరావు రాజునాయక్, జిల్లా నాయకులు పుల్లయ్య, మునిస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబశివుడు, పీఈటీ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తు రవికుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్ రాజకుమారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, జూలై 8: నంద్యాల కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజకుమారిని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నూతన కలెక్టర్‌గా రాజకుమారి బాధ్యతలు చేపట్టడంతో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా ఆమెను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్లు ఖాతా రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ నాయకులు గిరీశ్వర్‌రెడ్డి, జనసేన నాయకుడు నల్లమల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకపై హర్షం



నెహ్రూనగర్‌లో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పగిడ్యాల, జూలై 8: టీడీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజులలోపే ప్రభుత్వం ఉచితంగా ఇసుక పంపిణీ చేపట్టడం హర్షణీయమని టీడీపీ నాయకులు హేమసుందరరాజు, విజేయుడు అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో వారు సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఇసుకను కొనుగోలు చేయలేక ఎంతో మంది పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇబ్బందులు పడాల్సివచిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇసుక ధరలను పెంచడంతో నిర్మాణం చేపట్టుకునేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెంకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక ఉచితంగా అందజేస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు నెరవేర్చారన్నారు. అధికారం చేపట్టిన వెంటనే ఇసుకను ఉచితంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవడం గొప్ప విషయమన్నారు. టీడీపీ నాయకులు ఫరాక్ బాషా, శ్రీనివాసులు, వెంకటస్వామి గౌడ్, చాకలి నాగన్న, గోవిందు తదితరులు ఉన్నారు.

మలేరియా దినోత్సవ ర్యాలీ



మిడుతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మిడుతూరు, జూలై 8: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సోమవారం మిడుతూరులో వైద్య సిబ్బంది, కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి రాజు మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే మలేరియాను నిర్మూలించేదుకు గ్రామస్థులకు తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, ఆశా వర్కర్లు, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వెండి రథోత్సవం



స్వామి, అమ్మవార్ల వెండి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బంది

శ్రీశైలం, జూలై 8: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళ హారతులు ఇచ్చి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో సోమవారం పశ్చిమ గోదావరికి చెందిన ఉమామహేశ్వర కూచిపూడి కళాక్షేత్రం బృందంతో కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏకదంతాయ, భో..శంభో, లింగాష్టకం, మూషికవాహన, శంభోమమోదేవ తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

విజయకేతన సభకు తరలివెళ్లిన నాయకులు

పగిడ్యాల, జూలై 8: టీడీపీ నంద్యాల ఎంపీ డాక్టరు బైరెడ్డి శబరి సోమవారం నందికొట్కూరులోని పటేల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జన విజయకేతన సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నెహ్రూనగర్ గ్రామం నుంచి కట్టుబడి శ్రీనివాసులు నాయుడు, ప్రాతకోట గ్రామం నుంచి అల్లీ ఉసేన్, పగిడ్యాల గ్రామం నుంచి జయరామిరెడ్డి, ముచ్చుమర్రి గ్రామం నుంచి కాటం నాగన్న ఆధ్వర్యంలో వందల సంఖ్యలో వాహనాలు, ఆటోలు, బైక్‌లపై తరలివెళ్లారు.

కొత్తపల్లి: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ర్యాలీకి కొత్తపల్లి మండలం నుంచి భారీ ఎత్తున తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. సోమవారం వివిధ గ్రామాల సుమారు 30 వాహనాలతో వెళ్లారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

పాణ్యం, జూలై 8: మండలంలోని మద్దూరులో జరిగిన దూదేకుల పెద్ద దస్తగిరి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు పాణ్యం సీఐ నల్లప్ప తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన మద్దూరు గ్రామానికి చెందిన దూదేకుల పెద్ద దస్తగిరిని అదే గ్రామానికి చెందిన వడ్డె రామాంజనేయులు అలియాస్ అంజి, నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన గోగుల హరి, నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన పుట్ట శ్రీనివాసులు, పెద్ద కొట్టాలకు చెందిన పుచ్చకాయల రవితేజలు కారులో వచ్చి మద్దూరులోని బీసీ కాలనీలో పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని గొడ్డలి, కత్తి, కట్టెలతో దాడి చేసి చంపినట్లు తెలిపారు. పెద్ద దస్తగిరి కొడుకు దూదేకుల మదన్ షావలి అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో గిట్టని నిందితులు హత్య చేసినట్లు తెలిపారు. మృతుని కుమారుడు మదన్‌షావలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం మద్దూరు జడ్పీ హైస్కూలు సమీపంలో నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కారు, గొడ్డలి, కత్తి, రెండు కట్టెలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది నాగార్జున, వెంకటేశ్వర్లు, మన్సూర్ పాల్గొన్నారు

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, జూలై 8: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యఅన్నప్రసాద వితరణ పథకానికి సోమవారం పల్నాడుకు చెందిన చింత శ్రీనివాసరావు రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అదజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలనుఅందజేసి సత్కరించారు.

విత్తన దుకాణాల తనిఖీ



గడివేములలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నందికొట్కూరు, జూలై 8: నందికొట్కూరు పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువుల దుఖాణలపై కమిషనరేట్ నుంచి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. సోమవారం పట్టణంలోని పల్లవి సీడ్స్ న్యూ సుధాకర్‌రెడ్డి, మల్లికార్జున సీడ్స్ దుఖాణాల్లో తనిఖీలు చేశారు. రికార్డులను సరిగా నిర్వహించకపోవడంతో రూ.5.61 లక్షల విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను అమ్మకాలను నిలుపుదల చేశారు. వీటికి సంబంధించిన రికార్డులను సరిగా నిర్వహించిన చేసిన తర్వాతే సీజ్ చేసిన విత్తనాలను, ఎరువును విడుదల చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్, వ్యవసాయశాఖ డీడీఏ సుబ్రమణ్యం, నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, నంద్యాల ఏడీఆర్ రాజశేఖర్, డీఏవో టీప కళ్యాణ్, ఆయుబ్ బాషా, ఎంఏవో తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్, వ్యవసాయాధికారుల బృందం తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సుబ్రమణ్యం, విజిలెన్స్ సీఐ సునిల్‌కుమార్ సంయుక్తంగా దుకాణాలపై దాడులు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. రాధాకృష్ణ సీడ్స్ అండ్ ఫెర్టిలైజ్ షాప్‌లో సరైన రికార్డులు పొందుపరచకపోవడంతో రూ.17,280 విలువగల ఎరువుల విక్రయాలను నిలిపి వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎరువుల దుకాణ యజమానులకు ఎరువులు, విత్తనాలు విక్రయించడానికి తీసుకోవాల్సిన అనుమతుల గురించి వివరించారు. నకిలీ విత్తనాలు విక్రయించిన, అధిక ధరలకు ఎరువులు విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి, ఏవోలు కల్యాణ్‌కుమార్, ఆయూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

'నీట్ నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలి'



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నంద్యాల (కల్చరల్), జూలై 8: నీట్ నిర్వహణను రాష్ట్రాలకే అప్పగించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ రాజకుమారి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, నీట్ పరీక్షలు రద్దుచేసే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. నీట్ నిర్వహించడంలో విఫలమైన ఎన్‌టీఏను తక్షణమే రద్దు చేయాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గడివేముల, జూలై 8: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో సోమవారం భారత్‌గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ రవికిరణ్ విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా 10వ తరగతి విద్యార్థిని మహాలక్ష్మి మొదటి బహుమతి, 9వ తరగతి విద్యార్థి మహమ్మద్ ఆబీజ్ రెండో బహుమతి, 10వ తరగతి విద్యార్థి పవన్‌కుమార్ మూడవ బహుమతి గెలుపొందారు. పర్యావరణ పరిరక్షణపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా 10వ తరగతి విద్యార్థులైన జ్యోత్స్న మొదటి బహుమతి, సలీమ రెండో బహుమతి, అస్మా మూడో బహుమతి గెలుపొందారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాము కాటుకు చిన్నారి మృతి

ఆత్మకూరు రూరల్, జూలై 8: ఆత్మకూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన అలీనా(3) అనే బాలిక ఆదివారం రాత్రి పాముకాటుకు గురై మృతి చెందింది. ఆదివారం రాత్రి ఇంట్లో అలీనా తల్లిదండ్రులు మౌళాలి, సెమీనాలతో కలిసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. కాగా అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడిన పాము బాలిక కాలిపై కాటేసింది. అనంతరం బాలిక మేలుకుని మంచి నీరు తాగి నిద్రించేందుకు ప్రయత్నించగా కాలు నొప్పిగా ఉండటంతో తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో బాలిక పరిస్థితి అర్థంకాని తల్లి బాలికను పరిశీలించగా కుడి కాలిపై పాము కాటును గుర్తించారు. హుటాహుటిన అర్ధరాత్రి వారు అలీనాను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం బాలిక పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు కర్నూలుకు తీసుకెళ్ళాల్సిందిగా అలీనా తల్లిదండ్రులకు సూచించారు. అంతలోనే బాలిక కోలుకోలేక మృతి చెందడం జరిగిందని వైద్యులు నిర్ధారించారు..మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

క్షేమంగా ఇంటికి తీసుకు రండి

● బాలిక అదృశ్యంపై ఎంపీ శబరి ఆరా



బాలిక తల్లిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ శబరి

పగిడ్యాల, జూలై 8: అదృశ్యమైన బాలిక వాసంతిని క్షేమంగా ఇంటికి చేర్చేలా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టాలని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పోలీసులకు సూచించారు. మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చెందిన మద్దిలేటి, సుజాత దంపతులు కుమార్తె వాసంతి ఆదివారం ఆడుకునేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎంపీ శబరి సోమవారం నందికొట్కూరులో నిర్వహించిన విజయకేతన సభ ముగించుకొని నేరుగా గ్రామానికి చెరుకొని చిన్నారి ఇంటి వద్దకు వెళ్లి తల్లి సుజాతను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి తల్లి మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనతరం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నందికొట్కూరు సీఐ విజయభాస్కర్, ఎస్ఐ జయశేఖర్‌తో మాట్లాడారు. చిన్నారిని క్షేమంగా ఇంటికి తీసుకొని వచ్చేలా గాలింపు చర్యలు చేపట్టాలన్నారు. గతంలో తాను సొంత నిధులతో గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొస్తే కొందరు అడ్డు చెప్పారని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా సీసీ కెమెరాలు ఉంటే బాగుండేదన్నారు.

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'



అతిసార నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఆత్మకూరు రూరల్, జూలై 8: సీజన్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని నల్లకాలువ గ్రామంలో సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు చికిత్సలు అందించారు. అనంతరం గ్రామస్థులకు ఈ సీజన్‌లో డయేరియా విస్తరిస్తున్న నేపథ్యంలో ఆ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. చేతుల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిల మని సూచించారు. కాచి వడబోసిన నీటిని తాగాలని, శుభ్రమైన పాత్రలలో వేడి వేడిగా ఆహార పదార్థాలను తినడం ద్వారా డయేరియాను అరికట్టవచ్చని అన్నారు. ఈ వ్యాధి సోకిన వారు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎక్కువగా తాగాలని సూచించారు. వాంతులు విరేచనాలు,జ్వరం మొదలైన లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, సీహెచ్‌వో శివకుమార్, ఆరోగ్య కార్యకర్త భాస్కర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

గడివేముల, జూలై 8: వర్షం సకాలంలో కురవాలని మండలంలోని కరిమద్దెలలో గ్రామస్థులు సోమవారం గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో కురిసిన వర్షాలకు రైతులు మొక్కజొన్న, పత్తి, సోయ చిక్కుడు పంటలు సాగు చేశారు. వర్షాలు కురవకపోవడంతో పైర్లు ఎండుముఖం పట్టాయి. దీంతో ప్రజలు వర్షాలు కురవాలని కప్పలకు పెళ్లి చేశారు. గంగమ్మకు పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

'బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలి'

నంద్యాల (నూనెపల్లె), జూలై 7: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ చేరేందుకు ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారి చేసిందని, అయితే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జరల్ కోర్సును ఎత్తి వేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రైవేట్ కళాశాలల్లో చదవాలంటే పేద విద్యార్థులకు ఆర్థికంగా ఇబ్బందులు పడతారని అన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు



కలెక్టర్‌కు మెమెంటో అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నంద్యాల (కల్చరల్), జూలై 8: నంద్యాల కలెక్టర్ రాజకుమారిని సోమవారం సాయంత్రం రెడ్‌క్రాస్ సొసైటీ నాయకులు కలిశారు. కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీని అభివృద్ధి చేయడానికి తన వంతు సహాయ సహకారాలు అందస్తానని అన్నారు. జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు విస్తృతంగా అందిచాలని ఆమె సూచించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్‌చైర్మన్ మారుతీకుమార్, సెక్రటరీ వెంకట సుబ్బయ్య, ట్రెజరర్ నాగేశ్వరావు, కమిటీ సభ్యులు ఉస్మాన్‌బాషా, చైతన్య మద్దిలేటి, నాయక్ తదితరులు కలెక్టర్‌కు మెమెంటో అందజేశారు.

ఇసుక పాలసీతో నిర్మాణ రంగానికి ఊతం

● గత ప్రభుత్వ హయాంలో రూ.50 వేల కోట్ల కుంభకోణం

● శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు, జూలై 8: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన నెలలోపే సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తీసుకురావడంతో రాష్ట్రంలో నిర్మాణ రంగాన్ని ఊతమిస్తోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసి జగన్‌రెడ్డి బినామీ సంస్థ అయిన జేసీ వెంచర్స్ సంస్థ ద్వారా రూ.50వేల కోట్ల కుంబకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలో నిర్మాణ రంగం కుదేలవ్వడంతో ఆరంగంలో పనిచేసే లక్షలాది మంది కార్మికులు అవస్థలు పడ్డారని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి పేదలకు అండగా నిలుస్తామని తమనేత చంద్రబాబు హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే జీవో నెంబనే 48ని విడుదల చేసి ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఈ విధానంతో కేవలం రవాణా, లోడింగ్ చార్జీలతోనే ఇసుక లభించనుందని దీనివల్ల నిరుపేదల సొంతింటి కల నెరవేరడమే కాకుండా నిర్మాణ రంగం కూడా ఊపందుకుని కార్మికులకు ఉపాధి దక్కనుందని తెలిపారు. అయితే ఈ విధానంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా విజిలెన్స్ అధికారుల పర్యవేక్షణతో పాటు సుప్రీం, హైకోర్టు, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా ఇసుక పాలసీని అమలుచేయనున్నట్లు చెప్పారు. తమ అధినేత చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయాన్ని హర్షిస్తున్నట్లు వెల్లడించారు.

యథాస్థితికి అసైన్డ్ భూమి



ప్రైవేటు వెంచర్‌ను వ్యవసాయ భూమిగా మార్చుతున్న రైతు

పాణ్యం, జూలై 8: మండలంలోని తమ్మరాజుపల్లెలోని అసైన్డ్ భూమిని ప్రైవేటు వెంచర్‌గా మార్చిన భూమి రెవెన్యూ చర్యలతో యథాతథ స్థితికి చేరుకుంది. రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు చేపట్టడంతో సోమవారం భూమి యజమాని వ్యవసాయ భూమిలో వేసిన సర్వే రాళ్లు తొలగించి ట్రాక్టరుతో దున్ని విత్తనం వేశారు. దీంతో రైతుకు చెందిన భూమి వ్యవసాయ భూమిగా మారినట్లు పాణ్యం తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. చట్టప్రకారం చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.

ఘనంగా గురు పూజోత్సవం

మహానంది, జూలై 8: మహానంది ఆలయ పరిసరాల్లో సోమవారం ఉదయం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వయం సేవక సంఘం ముఖ్య కార్యదర్శి మార్తల జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యక్తి కాదు భగధ్వజమే శాశ్వతం అని అన్నారు. కాషాయ ధ్వజమే అన్నింటికీ ప్రామాణికంగా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘం సేవకులు పాల్గొన్నారు. అంతకు ముందు మహానంది ఆలయం చుట్టూ ఓం నమః శివాయ అంటూ నగర సంకీర్తనను సభ్యులు నిర్వహించారు.

'బోగస్ పింఛన్లపై విచారణ చేపట్టండి'



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్

ఆత్మకూరు, జూలై 8: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో బోగస్ సామాజిక పింఛన్లపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ సూచించారు. సోమవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ వేల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో కొందరు అనర్హులు పింఛన్లను పొందుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. వివరాలను పకడ్బందీగా విచారణ చేపట్టి బోగస్ పింఛన్లను ఏరి వేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఏవైనా పొరపాట్లు చోటుచేసుకుంటే సచివాలయ ఉద్యోగులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఏవైనా ఇబ్బందులు తలెత్తుతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రాజన్న పాలనలోనే రైతన్నల సంక్షేమం'

ఆత్మకూరు, జూలై 8: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలోనే రైతులు సంతోషంగా గడిపారని వైసీపీ నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం వైఎస్ఆర్ 75వ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామ సమీపంలోని వైఎస్ఆర్ స్మృతివనంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు నివాళి అర్పించారు. అలాగే ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్‌లో గల వైఎస్ఆర్ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, సురేష్, బాలస్వామి తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు కొత్తపల్లి మండలంలో ఘనంగ నిర్వహించారు. సోమవారం వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకుని నందికొట్కూరు వైసీపీ ఇన్‌చార్జి ధారా సుధీర్, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామిలు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ రంగ, నాయకులు జనార్దన్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, మహబూబ్ బాషా, గౌస్, సర్పంచులు బాల ఎల్లయ్య, మారెన్న, ఎంపీటీసీలు శివన్న, సోముల స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి'

నందికొట్కూరు, జూలై 8: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండి ప్రాణాలను కాపాడుకోవాలని సోషల్ వర్కర్ డి.శోభారాణి అన్నారు. సోమవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించి ప్రయాణించడంపై, ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన సదస్సు మండల లీగల్ సర్వీస్ కమిటీ సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని ఉత్తర్వుల మేరకు నందికొట్కూరు పాతబస్టాండ్ ప్రాంతంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సోషల్ వర్కర్ డి.శోభారాణి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం వల్ల జరిగే ప్రమాదాలను వాటి గురించి ట్రాఫిక్ రూల్స్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ కోర్టు సిబ్బంది, పర్సనల్ లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

'క్షేమంగా ఇంటికి వచ్చేలా చర్యలు తీసుకుంటాం'

పగిడ్యాల, జూలై 8: మండల పరిధిలోని కొత్త ముచ్చుమర్రి గ్రామంలో ఆదివారం అదృశ్యమైన వాసంతి ఆచూకీ కనిపెట్టి క్షేమంగా ఇంటికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం అదృశ్యమైన బాలిక వాసంతి తల్లిదండ్రులు, సేహితులను ఆయన విచారించారు. ఇంటి వద్దకు వెళ్లి ఎవరైన అనుమానితులు, గిట్టనివారు, ఎవరైన ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు. తరుచూ ఎవరి ఇండ్ల వద్దకు వెళ్లేదని అడిగి తెలుసుకున్నారు. పోలీసులు విచారణ చేపట్టి త్వరితగతిన బాలికను క్షేమంగా ఇంటికి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతామన్నారు. డీఎస్పీ వెంట సీఐ విజయభాస్కర్, ఎస్ఐ జయశేఖర్ ఉన్నారు.

ఊరిస్తున్న తుంగభద్ర

- టీబీ డ్యాంకు చేరిన 20.85 టీఎంసీల వరద
- 30,388 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు



తుంగభద్ర డ్యాంలో చేరిన వరద నీరు

కర్నూలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి వరద చేరికతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సోమవారం నీటి లెక్కలు తీసే సమయానికి డ్యాంలో 20.85 టీఎంసీలు వరద చేరింది. గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకు గాను 1599.47 అడుగుల వద్ద 20.85 టీఎంసీలు వరద చేరింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు 30,388 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. గత ఏడాది ఇదే సమయంలో 1576.72 అడుగుల్లో 3.08 టీఎంసీలు మాత్రమే నీరు ఉండేది. గతేడాదితో పోలిస్తే ఆశాజనకంగా వరద చేరడంతో కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగిరిస్తున్నాయి. గత ఏడాది ఇదే సమయంలో డెడ్ స్టోరేజీ కంటే దిగువకు నీటి నిల్వలు పడిపోగా జూలై 28వ తేదీ నాటికి డ్యాంలోకి 59.001 టీఎంసీలు వరద చేరి 1.07 లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో 28న ఎల్లెల్సీకి సాగునీరు విడుదల చేశారు. తాజాగా 20.85 టీఎంసీలు వరద చేరడంతో తక్షణమే జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించి సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారో తేల్చాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఆయకట్టు రైతుల్లో ఆశలు

తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) పరిధిలో ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో 43,519 ఎకరాలు, రబీలో 1,07,615 ఎకరాలు కలిపి 1,51,134 ఎకరాలు ఆయకట్టు ఉంది. కేడబ్ల్యూడీటీ (బచావత్ అవార్డు)-1 మేరకు 24 టీఎంసీలు నికర జలాలు వాటా ఉంది. ఈ ఏడాది 2024-24 నీటి సంవత్సరం)లో 172 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని జూన్ 6న జరిగిన తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు వాటర్ రివ్యూ కమిటీ అంచనా వేసింది. బచావత్ అవార్డు దామాషా ప్రకారం కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీకి 24 టీఎంసీలకు గానూ 19.472 టీఎంసీలు, కేసీ కెనాల్‌కు 10 టీఎంసీలకు గానూ 8.113 టీఎంసీలు కలిపి 27.585 టీఎంసీలు కేటాయించారు. అదే క్రమంలో డ్యాంలో 25 టీఎంసీలకు పైగా వరద చేరి.. ఇన్‌ఫ్లో ఆశాజనకంగా ఉంటే జూలై 20న కర్నూలు, అనంతపురం జిల్లాల జలవనరుల శాఖ ఎస్‌ఈలు ఇచ్చే ఇండెంట్ మేరకు ఎల్లెల్సీ, హెచ్చెల్సీలకు సాగు నీరు ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. రెండు రోజులు క్రితం కలెక్టరు పి.రంజిత్‌బాషా ఇరిగేషన్ ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షలో ఇదే అంశంపై ఇంజనీర్లతో చర్చించడమే కాకుండా టీబీ డ్యాంలో 25 టీఎంసీలకు పైగా వరద చేరగానే ఐఏబీ సమావేశం ఏర్పాటు చేయాలంటూ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రస్తుతం వరద చేరిక ఊరిస్తుండడంతో ఐఏబీ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారు..? ఏ తేదీ నుంచి నీటిని విడుదల చేస్తారని ఆయకట్టు రైతులు అడుగుతున్నారు. అయితే.. సోమవారం ఉదయం 30,388 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంటే.. సాయంత్రానికి 21 వేలకు పడిపోవడం, ఎగువ నుంచి కూడా వరద తగ్గడంతో పంట కాలువలకు సాగునీటి విడుదలపై టీబీపీ బోర్డు ఇంజనీరింగ్ అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.



ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు బోరుబావుల కింద పెంచుతున్న వరినారు

ఆర్మీ జవాన్ తల్లి స్థలం కబ్జా

తహసీల్దార్ వద్ద బోరున విలపించిన బాధిత మహిళ



తహసీల్దార్ వద్ద కన్నీరు పెట్టిన దాసరి లక్ష్మి

ఆదోని రూరల్, జూలై 8 : వైసీపీ నాయకుడు లక్ష్మన్న తమ స్థలాన్ని కబ్జా చేశాడని బాధిత మహిళ తహసీల్దార్ ఎదుట బోరున విలపించింది. ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామానికి చెందిన దాసరి వెంకటేశులు, లక్ష్మి దంపతులు ఆదోనిలో స్థిరపడ్డారు. వీరి ఒక్కగానొక్క కొడుకు దాసరి శ్రీనివాసులు ఆర్మీ జవాన్. వీరికి 1999లో అప్పటి ప్రభుత్వం రాయనగర్‌లో సర్వే నెం. 158లో రెండున్నర సెంట్ల స్థలాన్ని కేటాయించింది. ఆర్డీటీ సంస్థ ఒకటిన్నర సెంట్ స్థలంలో ఇల్లు కట్టించింది. నాలుగు సంవత్సరాల క్రితం వెంకటేశులు మృతి చెందడంతో లక్ష్మి ప్రస్తుతం ఆలూరులో బంధువుల వద్ద నివాసం ఉంటోంది. మూడు సంవత్సరాల క్రితం రాయనగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు లక్ష్మన్న ఈమె సెంటు స్థలాన్ని కబ్జా చేశాడు. ఆదోనికి చెందిన ఈరన్న, దానం, కప్పగల్ రెడ్డి న్యాయం చేస్తామంటూ ఆమె వద్ద నుంచి రూ.70వేలు వసూలు చేశారు. మోసపోయానని తెలిసిన దాసరి లక్ష్మి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, జయమనోజ్‌రెడ్డి చుట్టూ తిరిగింది. ఎట్టకేలకు జయమనోజ్ రెడ్డి వారి నుంచి రూ.60వేలను ఆమెకు తిరిగి ఇప్పించాడు. అయితే వైసీపీ నాయకుడు కబ్జా చేసిన స్థలాన్ని మాత్రం ఇప్పించలేదు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ ప్రజా పరిష్కార వేదికలో సోమవారం బాధిత మహిళ తహసీల్దార్ హసినా సుల్తానాను కలిసి వినతిపత్రం అందించి బోరుమంది.

కడప ఆర్జేడీగా కర్నూలు డీఈవోకు అదనపు బాధ్యతలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 8: పాఠశాలల విద్యాశాఖ కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న వై. రాఘవరెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీ ఏర్పడిన ఈ స్థానంలో కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌కు అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.

ఏపీ టెట్ షెడ్యూల్‌లో మార్పులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 8: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌లో ప్రభుత్వం మార్పులు చేసింది. జూలై 2న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆగస్టు 5 నుంచి 20వ తేదీ వరకు జరగాల్సిన టెట్ పరీక్ష ఈ పరీక్షలను అక్టోబరు 3 నుంచి 20వ తేదీ వరకు వాయిదా వేసినట్లు తెలిసింది. ప్రిపరేషన్‌కు సమయం కావాలని అభ్యర్థులు కోరిన మీదట ఈ సవరణల నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. అక్టోబరు 27న ఫైనల్ కీని విడుదల చేస్తారు. నవంబరు 2న తుది ఫలితాలను ప్రకటించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

పోక్సో కేసులో వృద్ధుడికి జైలు, జరిమానా

కర్నూలు(లీగల్), జూలై 8: నాలుగు సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన 75 ఏళ్ల నిందితుడికి ఐదేళ్ల కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి జి. భూపాల్ రెడ్డి సోమవారం తీర్పు చెప్పారు. 2020 నవంబరు 18న జిల్లాలోని ఓ గ్రామంలో.. ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన నిందితుడు తన ఇంటిలోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లి ముచ్చుమర్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి డీఎస్పీ శృతి నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతని వయస్సును దృష్టిలో పెట్టుకుని ఐదేళ్ల కారాగారార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున వంగాల వెంకటేశ్వరరెడ్డి వాదించారు.

హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సు

కర్నూలు(లీగల్), జూలై 8: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ. లీలా వెంకట శేషాద్రి కోరారు. హెల్మెట్ల ధారణపై సోమవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో జరిగిన ఓ అవగాహన సదస్సులో మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం కింద హెల్మెట్లు ధరించని వాహనదారులకు శిక్షలు పడతాయని అన్నారు. ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ వాడటం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర్ పాల్గొన్నారు.

నంద్యాల కానిస్టేబుల్‌కు పతకం



అభినందిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల (క్రైమ్), జూలై 07: అస్సాంలోని గోహతిలో జరిగిన 9వ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 24-25 జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో నంద్యాలకు చెందిన కానిస్టేబుల్ పరహాతుల్లా పతకం సాధించారని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి సోమవారం తెలిపారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు జరిగిన పోటీల్లో పురుషుల కరాటే, పెన్కాక్‌సిలాట్ థైక్వాండో విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఏపీ పోలీస్ శాఖ నుంచి 16మంది పాల్గొన్నారు. నంద్యాల జిల్లా నుంచి నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్ నుంచి పరహాతుల్లా థైక్వాండో విభాగంలో పాల్గొని బ్రాంజ్ మెడ్ సాధించడం గర్వకారణమన్నారు. సోమవారం ఎస్పీ చాంబర్‌లో పరహాతుల్లాను అభినందించారు.

సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

కలెక్టర్ జి. రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల (కల్చరల్), జూలై 7: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన విన్నతులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో పాల్గొని జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తులోని అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టంకు భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వస్తున్నాయని, వీఆర్వోలు సరిగా పని చేయడం లేదనే విషయం స్పష్టమతోందన్నారు. కార్యక్రమంలో 123 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించారు.

అధికారులు పని వేళలు పాటించాలి

జిల్లా అధికారులు సమయపాలన పాటించాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజలకు సేవలందించండలో ఫైల్ ఈ ఆఫీస్ ద్వారానే రావాలన్నారు. కింది స్థాయి గుమాస్తా నుంచి పైస్థాయి అధికారి వరకు ఈసైన్‌తోనే ఫైల్ రావాలని కలెక్టర్ సూచించారు. కోర్టు కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సెలవులో వెళ్లవలసి వస్తే మూడు రోజులు ముందుగానే అనుమతి తీసుకోవాలని అన్నారు.

ఏమిచ్చి ప్రజల రుణం తీరుకోగలను?

- ఢిల్లీలో నందికొట్కూరు పేరు నిలబెడతా..
- నెల రోజులుగా స్వర్ణాంధ్రప్రదేశ్‌ను చూస్తున్నాం
- నంద్యాల ఎంపీ బైరెడ్డి డా. శబరి



ర్యాలీకి భారీగా తరలి వచ్చిన జనాలు



మాట్లాడుతున్న బైరెడ్డి డా.శబరి

నందికొట్కూరు, జూలై 08: ఓటర్లు తమ ఆడబిడ్డగా భావించి ఎన్నికల్లో గెలిపించారని, ఏమిచ్చి వారి రుణం తీర్చుకోగలను? అని నంద్యాల ఎంపీ బైరెడ్డి డా. శబరి అన్నారు. నంద్యాల ఎంపీగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా నందికొట్కూరు నియోజకవర్గానికి వచ్చిన బైరెడ్డి డా. శబరికి నందికొట్కూరు టీడీపీ నాయకులు భారీ స్వాగతం పలికారు. నందికొట్కూరు కొత్త బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ తనకు ఓటు వేసి గెలిపించినందుకు నందికొట్కూరు పేరును పార్లమెంటులో నిలబెడ తానని అన్నారు. ఐదేళ్ల పాటు అంధకార ఆంధ్రప్రదేశ్‌ను చూశా మని, టీడీపీ అధికారంలోకి వచ్చిన ఈ నెలలో స్వర్ణాంధ్రప్రదేశ్‌ను చూస్తున్నామని అన్నారు. వృద్ధులకు, వికలాంగులకు పెంచిన పింఛ న్లు ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవ్వాతాతలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడన్నారు. త్వరలోనే 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు నెలకు రూ.1500 పథకాన్ని ముఖ్యమంత్రి అమలు చేస్తారన్నారు. యువత, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను పెంచే వ్యూహంతో చంద్రబాబు నాయుడు ముందుకు వెళుతున్నారని అన్నారు. నియోజకవర్గానికి నీళ్లు తీసుకొచ్చేందుకు ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేస్తామ న్నారు. నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రంలోనే అభివృద్ధిలో నందికొట్కూరును నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అని ఆమె అన్నారు. ఈ సమావేశంలో ఆమె ప్రసంగం జరుగుతుండగా ఉక్కపోతతో స్పృహ కోల్పోయిన ఓ యవకుడిని స్టేజిపైకి తెప్పించుకొని ఎంపీ డా. బైరెడ్డి శబరి ప్రథమ చికిత్స అందించారు.

నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా..: బైరెడ్డి

చంద్రబాబు నాయుడు డా. బైరెడ్డి శబరి ప్రతిభను గుర్తించి టిక్కెట్ ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బైరెడ్డి శబరి ఇక నుంచి 'మీ బిడ్డ అని, మీ చేతుల్లో పెడుతున్నానని, ఆమె భవిష్యత్తు మీదే' అని ఆయన నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, నందికొట్కూరు మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కాకరవాడ చిన్న వెంకటస్వామి, తెలుగుయువత రాష్ట్ర నాయకులు మహేష్ నాయుడు, నాగేశ్వరరావు, సాహెబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాసోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, జూలై 8: శ్రీశైలం దేవస్థానంలో ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 3 వరకు శ్రావణ మాసోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సంద ర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు శ్రావణ మాసోత్సవాల ఏర్పాట్లపై పరిపాలనా భవనంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షలో ఉభయ దేవాలయాల ప్రధానా ర్చకులు, అధ్యాపక, సీనియర్ వేద పండితులు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ శ్రావణ మాసంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలని ఆయా విభాగాలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా శ్రావణ సోమవారాలు, శ్రావణ పౌర్ణమి, వరలక్ష్మీవ్రతం, శుద్ధ, బహుళ ఏకాదశి, శ్రావణ మాస శివరాత్రి, సెలవు రోజుల్లో అత్యధికంగా భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తారన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సౌకర్యవంతమైన దర్శనం, వసతి, తదితర సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శ్రావణ మాసంలో ఆగస్టు 15 నుంచి 19 వరకు ఐదు రోజులపాటు భక్తుల రద్దీ దృష్ట్యా స్వామివారి స్పర్శ దర్శనాన్ని నిలుపుదల చేసి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి కల్పించనున్నట్లు తెలిపారు. మిగిలిన రోజుల్లో నిర్దిష్ట వేళలలో రోజుకు నాలుగు విడతలుగా స్వామివారి స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే భక్తుల రద్దీ కారణంగా శ్రావణ శని, ఆది, సోమవారాలు, స్వాతంత్ర్య దినోత్సవం, వరలక్ష్మీవ్రతం, పౌర్ణమి మొదలైన రోజుల్లో మొత్తం 16 రోజులు స్వామివారి గర్భాలయ, సామూహిక అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చనలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. శ్రావణ మాసంలో రెండు పర్యాయాలు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను జరిపించనున్నారు. అదేవిధంగా లోకకల్యాణం కోసం శ్రావణమాసమంతా ఏడు భజన బృందాలతో అఖండ చతుస్సప్తాహ శివభజనలు నిర్వహించనున్నారు.

కక్ష సాధింపులను ప్రోత్సహించం

రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి



కార్యకర్తలతో గ్రామ సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

కొలిమిగుండ్ల, జూలై 8: తెలుగుదేశం పార్టీ పాలనలో కక్ష సాధింపులను ప్రోత్సహించమని, అదే సందర్భంలో అవినీతికి పాల్పడిన అధికారులను, నాయకులను వదిలి పెట్టబోమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. సోమవారం మొదటిసారి మంత్రి హోదాలో కొలిమిగుండ్ల మండలానికి విచ్చేసిన బీసీ జనార్ధనరెడ్డికి టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, పులి ప్రకాశ్‌రెడ్డి, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం బెలుం గుహల ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాల కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి, గ్రామాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి బీసీ మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు. రహదారులు, పంచాయతీరాజ్, విద్యుత్, తాగునీటి సరఫరా, వ్యవసాయం తదితర అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని, అభివృద్ధిని అటకెక్కించారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపడతామన్నారు. పునర్ నిర్మాణమే లక్ష్యమంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించామని, కేంద్రం సానుకూలంగా స్పందించిందని బీసీ వివరించారు. రహదారులు, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గత పాలనలో అవినీతికి పాల్పడి, అక్రమ కేసులు పెట్టిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టమని అన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని బీసీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత ఐవీ పక్కీరారెడ్డి, ఇటిక్యాల బాలిరెడ్డి, గొంగటి హుస్సేన్ రెడ్డి, అంబటి జయలక్ష్మీరెడ్డి, అంకిరెడ్డిపల్లె నారాయణరెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, నంద్యాల ప్రసాదు, ఉలువల నరసిం హుడు, నాగేశ్వరరెడ్డి, కమ్మవా రిపల్లె రాందాస్ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి



వేడుకల్లో పాల్గొన్న లక్ష్మీనరసింహయాదవ్

కల్లూరు, జూలై 8: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు నంద్యాల కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహాయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం నంద్యాల చెక్‌పోస్టులోని దామోదరం సంజీవయ్య భవన్‌లో ఆయన కార్మికులు, చిన్నపిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా లక్ష్మీనరసింహయాదవ్ మాట్లాడుతూ రైతు భాంధవుడుగా పేరొంది ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన మహనీయుడు వైఎస్ అని కొనియాడారు.

వ్యక్తి ఆత్మహత్య

గడివేముల, జూలై 8: మండలంలోని కొరటమద్ది గ్రామానికి చెందిన నాగమద్దిలేటి (44) ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నాగమద్దిలేటి లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మధుమేహం, బీపీ వ్యాధితో బాధపడుతున్న నాగమద్దిలేటి జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

చంద్రన్న బీమాకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 8: జూన్ 30 వరకు సహజ, ప్రమాదవశాత్తు మరణించిన వారి బంధువులు చంద్రన్న బీమాకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా సోమవారం తెలిపారు. క్లెయిమ్స్ సంబంధించిన డాక్యుమెంట్లను అప్‌లోడు చేయాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలన్నారు.

రన్‌వే ఎక్స్‌టెన్షన్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 8: ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో రన్‌వే ఎక్స్‌టెన్షన్‌కు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర పి. రంజిత్ బాషా ఎయిర్‌పోర్టు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జేసీ నారపురెడ్డి మౌర్యతో కలిసి ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టులో రన్‌వే ఎక్స్‌టెన్షన్‌కు కావాల్సిన నిధులు తదితర వివరాలతో పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విమానాలు రాత్రి సమయంలో ల్యాండ్ అయ్యేందుకు గాను రన్‌వేలో కల్పించాల్సిన సౌకర్యాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శేషిరెడ్డి, డీపీవో నాగరాజనాయుడు, ఓర్వకల్లు తహసీల్దార్ నటరాజ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓర్వకల్లు, జూలై 8: మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై కాల్వబుగ్గ ఏపీఆర్ పాఠశాల ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం ఒకరు మృతి చెందారు. నెల్లూరు జిల్లా వేదాయపాలెం గ్రామానికి చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ప్రసాద్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ద్విచక్రవాహనంపై వెళ్తున్న మౌలాలి (74)ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మౌలాలికి తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు చాంద్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో విగ్రహాల దొంగతనం

బేతంచెర్ల, జూలై 8: పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో గత రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రూ.2.50 లక్షల విలువ చేసే రెండు విగ్రహాలను దొంగతనం చేశారు. ఆలయంలోని వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పంచలోహ విగ్రహాలను దొంగలు అపహరించుకుని వెళ్లారు. వీటి విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ శివశంకర్ నాయక్ తన సిబ్బందితో అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించి క్లూజ్ టీమ్‌ను రప్పించి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం



సంజామల కోట వీధిలో కొలువైన పీర్లు

సంజామల, జూలై 8: మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో ఆదివారం పీర్ల దేవతలను కొలువుదీర్చారు. ముస్లింలు పీర్లకు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. సంజామల కోటవీధిలో హజరత్ అబ్బాస్, కమలమ్మ బావి వీధిలో ఇమామ్ ఖాసీం ఆయా గ్రామాల్లో హసన్ హుసేన్ పీర్ల దేవతలను కొలువుదీర్చారు. ఇందులో భాగంగా చిన్న సరిగెత్తు, మధ్య సరిగెత్తు, పెద్ద సరిగెత్తు నిర్వహించి మొహర్రం పదో రోజు షహదత్ వేడుకలను నిర్వహిస్తారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఆ స్థానంలోని పీర్ల చావిడిలో బంగారు, వెండి పీర్లను కొలువుదీర్చారు. పది రోజుల పాటు పీర్ల పండుగ వేడుకలు నిర్వహించనున్నారు. చిన్న సరిగేసు, మధ్య సరిగేసు, పెద్ద సరిగేసు వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ముస్లిం మత పెద్దలు ఏర్పాట్లు చేశారు.

చాగలమర్రి: హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక మొహర్రం పండుగ. ఈ పండుగను ఘనంగా నిర్వహించుటకు లాల్‌స్వామి కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి.

ఉచిత ఇసుకపై హర్షం



మాట్లాడుతున్న టీడీపీ, జనసేన నాయకులు

డోన్, జూలై 8: టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని సోమవారం నుంచి అమలు చేయడంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలో వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను బ్లాక్‌లో అమ్ముతూ ప్రజలను భారీగా దోచుకున్నారని విమర్శించారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉచిత ఇసుక పాలసీని పేదలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. ఇసుకను తీసుకెళ్లే సమయంలో సంబంధిత గ్రామ అవసరాల కోసం నిర్దేశించిన రూ.88 ఫీజును, దానిపై జీఎస్‌టీని వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుం దన్నారు.

డోన్(రూరల్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయనున్న నూతన ఇసుక పాలసీ విధానంపై డోన్ పట్టణ టీడీపీ యువ నాయకులు హనుమంతరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక మాఫియా పేట్రేగిపోయిందన్నారు. పేదలు, సామాన్యులకు అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇసుక ధరలను పెంచేసి అందుబాటులో లేకుండా చేసిందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా చేశారన్నారు. చంద్రబాబు పేదలకు ఉచిత ఇసుక విధానం అమలు చేస్తూ వారి సొంతింటి కళ నెరవేర్చిందన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం'



కస్తూర్బా పాఠశాలలో సభ్యత్వం నమోదు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

చాగలమర్రి, జూలై 8: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడతామని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్, రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాగేంద్రకుమార్ తెలిపారు. సోమవారం ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు మస్తాన్‌బాషా, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు ఆధ్వర్యంలో మండలంలోని చింతలచెరువు, చిన్నవంగలి, పెద్దవంగలి, కస్తూర్బా, చాగలమర్రి బాలుర, బాలికల పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, నాయకులు నారాయణ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సురేషప్ప, శ్రీనివాసులు, శేషాద్రి పాల్గొన్నారు.

నేడు మంత్రి బీసీ రాక

అవుకు, జూలై 8: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం అవుకుకు వస్తున్నట్లు టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీసీ జనార్దన్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశంలో పాల్గొనేందుకు వస్తున్నారన్నారు. అవుకు పట్టణం మెట్టుపల్లె రహదారిలోని ఎస్సార్బీసీ గెస్ట్‌హౌస్ వద్దకు మధ్యాహ్నం 2గంటలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకోవాలని తెలిపారు.

ఐరన్ మార్ట్‌లో చోరీ

నంద్యాల, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని టీబీ రోడ్డులో ఉన్న శ్రీసదాశివ ఐరన్ మార్ట్‌లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. షాపులోని లాకర్ ఉన్న రూ.40 వేలు నగదు, మూడు వన్‌గ్రామ్ గోల్డ్ కాయిన్స్ చోరీకి గురైనట్లు పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. క్లూస్ టీం సభ్యులు సంఘటనా స్థలాన్ని చేరుకొని సీసీ ఫుటేజిలను పరిశీలించారని చెప్పారు. ఐరన్ మార్ట్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది

బేతంచెర్ల, జూలై 8: హైవే నిర్మాణం పనుల్లో భాగంగా గుంతలు తీయడంతో తమ పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉందని మండలంలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన రైతులు డిప్యూటీ తహసీల్దార్ మధుకు, ఎస్ఐ శివశంకర్ నాయక్‌లకు రైతులు వినతి పత్రం సోమవారం అందజేశారు. రైతులు పొలాలకు వెళ్లాలంటే హైవే నిర్మాణం పనులు జరుగుతుండటంతో పొలాలకు వెళ్లే రస్తాలో గుంతలు పడుతున్నాయని, హైవే నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టరు తాము పొలాలకు వెళ్లేందుకు రస్తాను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు చంద్రశేఖ్, ఓబులేసు, గోపాల్, వెంకట్రామిరెడ్డి, రంగడు, భాస్కర్ చిన్న మద్దయ్య, మనోహర్, నాగేంద్ర, నాగరాజు, నాగేషు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు ఏబీవీపీ వ్యవస్థాపక దినోత్సవం

బేతంచెర్ల, జూలై 8: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రవిశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఏబీవీపీ నంద్యాల జిల్లా కన్వీనర్ రాసిపోగుల రవిశేఖర్ ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులతో కొత్తబస్టాండు నుంచి పాతబస్టాండు వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న ఏబీవీపీ వ్యవస్థాపక దినోత్సవం ఇప్పటికి ఏబీవీపీ 75 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని 76వ సంవత్సరంలోకి అడుగు పెడుతుందన్నారు. ఏబీవీపీ నిరంతరం విద్యార్థుల కోసం పోరాడుతూ విద్యార్థుల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, మధుకార్తీక్, దత్తు, అవినాష్ పాల్గొన్నారు.

మంత్రి బీసీకి అభినందనలు





మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇస్తున్న బనగానపల్లె డిగ్రీ కళాశాల అధ్యాపకులు, అవుకు పట్టణ ఆర్యవైశ్యులు

బనగానపల్లె, జూలై 8: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని పలువురు అధికారులు, నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. సోమవారం పట్టణంలోని మంత్రి స్వగృహంలో బనగానపల్లె పట్టణ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మంత్రి బీసీని కలిసి, పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. అలాగే చంద్రన్న బీమా అధికారులు, బీమా మిత్రలు మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్, బాబునాథ్, బడేసాహెబ్, వరలక్ష్మి, రామకిష్ట, చంద్రన్న బీమా మిత్ర జిల్లా అధ్యక్షురాలు స్రవంతి, కల్పనారెడ్డి, వేదవతి పాల్గొన్నారు.



మంత్రి బీసీని సన్మానిస్తున్న టూరిజం శాఖ ఉద్యోగులు

అవుకు: పట్టణంలోని ఆర్యవైశ్యులు రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని బనగానపల్లెలో సోమవారం కలిశారు. అవుకు పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు మేడం ఆంజినేయులు, జనరల్ సెక్రటరీ తల్లం సుబ్బనాగభూషణం, మల్లెల ఆంజినేయులు, యువజన సంఘం అధ్యక్షుడు తాళేపల్లి నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు మంత్రి బీసీని కలసి బొకే అందించి అభినందనలు తెలిపారు. మంత్రి బీసీ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు బొగ్గరపు పద్మనాభయ్య, విశ్వనాథ సుబ్రహ్మణ్యం, కొండూరు సురేష్, మేడం సతీష్, సాయిప్రసాద్, శంకర్, మల్లెల సతీష్, వంకదారి సతీష్ పాల్గొన్నారు.

పర్యాటక శాఖ అభివృద్ధికి కృషి చేయండి

కొలిమిగుండ్ల: ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని టూరిజం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బెలుం గుహలకు వచ్చిన సందర్భంగా టూరిజం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర రామక్రిష్ణ, జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో గుహల యూనిట్ మేనేజర్ అమర్నాథరెడ్డి, వెంకటరెడ్డి, దస్తగిరి, బాబు, నిజాముద్దీన్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాళ్లరిగేలా తిరిగినా కనికరించలేదు

- ఆర్మీ ఉద్యోగులకు భూ కేటాయింపులో గత ప్రభుత్వ నిర్లక్ష్యం
- న్యాయం చేయాలంటున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు



పత్రాలు చూపుతున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు

కొలిమిగుండ్ల, జూలై 8: వారు దేశ రక్షణ విభాగంలో పని చేసిన ఆర్మీ ఉద్యోగులు. దేశానికి సేవలందించిన వారి పట్ల గత వైసీపీ ప్రభుత్వం, అధికారులు ఏమాత్రం కనికరించలేదు. కొలిమిగుండ్ల మండల కేంద్రానికి చెందిన కె.చంద్రశేఖర్, టి.రమణమూర్తి 17సంవత్సరాల పాటు ఆర్మీలో సేవలందించి, రిటైర్మెంట్ తీసుకున్నారు. తమకు జీవనాధారంలో భాగంగా 5ఎకరాల భూమి కేటాయించాలంటూ 2020 సంవత్సరంలో జిల్లా సైనిక బోర్డును ఆశ్రయించారు. దీంతో సైనిక్ బోర్డు వీరికి అవకాశం వున్న చోట భూమి కేటాయించి ఉపాధి చూపాలని జిల్లా కలెక్టరుకు లేఖ రాశారు. కలెక్టర్ కార్యాలయం నుండి కొలిమిగుండ్ల మండల తహశీల్దార్ కార్యాలయానికి సమస్యను పరిష్కరించాలంటూ ఆదేశాలు అందాయి. అయితే భూములు అందుబాటులో వున్నా గత నాలుగేళ్లగా రాజకీయ నాయకుల వత్తిళ్లతో స్థానిక అధికారులు వీరి సమస్యను పట్టించుకోలేదు. భూమి కేటాయించడానికి రకరకాల కారణాలను చెబుతూ కాలయాపన చేశారని ఆర్మీ ఉద్యోగులు చంద్రశేఖర్, రమణమూర్తి ఆంధ్రజ్యోతి ముందు వాపోయారు. టీడీపీ ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

చాగలమర్రి, జూలై 8: సమస్యల పరిష్కారం కోసమే మీకోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో న్యామతుల్ల, సూపర్‌వైజర్ సుశీల, పశువైద్యాధికారి సాయిబాబా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కోవెలకుంట్ల, జూలై 8: కోవెలకుంట్లలో ఎరువుల దుకాణాలను సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఏడీఏ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఆఫీసరు సిద్దయ్య, కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, నంద్యాల ఏవో ప్రసాదరావు కలిసి కోవెలకుంట్ల పట్టణంలోని వివిధ ఎరువుల దుకాణాలను తనిఖీ చేయగా రూ.2,93,365 విలువ గల ఉత్పత్తులకు సంబంధిత డాక్యు మెంట్లు లేకపోవడంతో వాటిని అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఏవో నిరంజన్ తెలిపారు.

'అధిక ధరకు విక్రయిస్తే చర్యలు'

దొర్నిపాడు, జూలై 8: మండలంలోని ఆయా గ్రామాల్లో రసాయన ఎరువుల దుకాణాల్లో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సిద్ధయ్య, ప్రవీన్ కుమార్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని దొర్నిపాడు గ్రామంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఏడీఏ శ్రీనివాసులు, కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, ఏవో సునీత ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికపై నిర్లక్ష్యం

కొలిమిగుండ్ల, జూలై 8: మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికపై మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. 12.30 సమయంలో కూడా తహసీల్దార్, వీఆర్వోలు, ఒకరిద్దరూ అధికారులు మినహా కార్యక్రమానికి హాజరు కాలేదు. హాజరు రిజిస్టారులో తహసీల్దార్ సునితాబాయి సంతకం చేయగా కొంత పేజీ ఖాళీగా ఉంచి, వీఆర్వోలు సంతకాలు చేశారు. దీన్ని బట్టి మండల అధికారులు వారికి ఇష్టమొచ్చిన సమయంలో రిజిస్టారులో సంతకాలు చేస్తున్నట్లు అర్థమవుతోంది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండగా కింది స్థాయి అధికారుల ఇలా వ్యవహరించడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీడీపీ నాయకురాలి మృతికి సంతాపం

చాగలమర్రి, జూలై 8: చాగలమర్రి గ్రామంలోని బుగ్గవీధిలో నివాసం ఉంటున్న టీడీపీ మహిళా నాయకురాలు చెన్నమ్మ (80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల టీడీపీ నాయకులు సంతాపం ప్రకటించి కుటుంబం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. చెన్నమ్మ మృతి టీడీపీ పార్టీకి తీరని లోటని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి అన్సర్‌బాషా, టీడీపీ నాయకులు సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు అన్నారు. మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. జెట్టి నాగరాజు, అబ్దుల్లా, అబ్దుల్‌ఖాదర్, ఓబులేసు, ఆవుల ప్రతాప్ ఉన్నారు.

రేపటి నుంచి రికార్డుల తనిఖీ

రుద్రవరం, జూలై 8: ఈ నెల 10 నుంచి పంచాయతీల్లో అన్ని రికార్డులు పరిశీలిస్తున్నట్లు ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ సోమవారం తెలిపారు. 10న యల్లావత్తుల, శ్రీరంగాపురం, 11న పెద్దకంబలూరు. చిన్నకంబలూరు, 12న బీరవోలు, డి.కొట్టాల. కోటకొండ, 16న పేరూరు, ఎర్రగుడిదిన్నె, 18న కొండమాయపల్లె, రుద్రవరం, 19న మందలూరు, చందలూరు, చిలకలూరు, 20న నరసాపురం, ముద్దలూరు, ఆలమూరు, 23న చిత్తరేణిపల్లె, హరినగరం, ఆర్.నాగలవరం, టి.లింగందిన్నెపల్లెపంచాయతీల్లో రికార్డులు పరిశీలిస్తామని చెప్పారు.

'రైతులకు అందుబాటులో ఉండాలి'

చాగలమర్రి, జూలై 8: గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఏవో రంగనేతాజీ సూచించారు. సోమవారం చాగలమర్రి మూడవ ఆర్బీకేని తనిఖీ చేశారు. వ్యవసాయ సిబ్బందిచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఈవో మంజుల ఉన్నారు.

పాఠశాల తనిఖీ: మండలంలోని చిన్నవంగలి ఉన్నత పాఠశాలను ఎంఈవో అనూరాధ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం జీవయ్య, సీఆర్పీ ఖాశీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూటుపల్లె చెరువును నింపాలి

ఏపీ రైతు సంఘాల డిమాండ్



మాట్లాడుతున్న రాజశేఖర్

బేతంచెర్ల, జూలై 8: మండలంలోని గూటుపల్లె చెరువును హంద్రీనీవా నీటితో ఎత్తిపోతల పథకం నీటితో నింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో మండల రైతు సంఘం సమావేశం గౌరవ అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పూర్తిగా వర్షాధారం మీద ఆధారపడిన ప్రాంతం బేతంచెర్ల మండల ప్రాంతమన్నారు. మండలంలో గూటుపల్లెచెరువపై భాగాన పోతున్న హంద్రీనీవా కాల్వ నీటిని, ఎత్తిపోతల ద్వారా గూటుపల్లె చెరువుకు నింపితే మండలంలోని గ్రామాల పొలాల్లో వేసుకున్న బోరుబావులకు నీరు పుష్కలంగా అందుతుందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, మండల కార్యదర్శి రామ్మోహన్ నాయకులు హరిసర్వోత్తమ రెడ్డి, రామచంద్రుడు, అనిల్, రైతులు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ దేవనాథ్‌కు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు.

నీటి ట్యాంకుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్యాపిలి, జూలై 8: నీటి ట్యాంకుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తా మని ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఇవి తాగే నీళ్లేనా' అన్న శీర్షికన కథనం వెలువడింది. దీంతో స్పందించిన ఈవోఆర్డీ వెంటనే పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడారు. గ్రామాల్లో తిరిగి నీటి ట్యాంకుల పరిశుభ్రతపై ఆరా తీస్తామన్నారు. ఏ గ్రామంలోనైన ట్యాంకులు శుభ్రం చేయడం లేదని తెలిస్తే సం బంధిత కార్యదర్శిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

'మెరుగైన విద్యనందించాలి'

దొర్నిపాడు, జూలై 8: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు మెరుగైన విద్యానందించాలని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలితమ్మ సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేశారు ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నోట్ పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ అందజేయాలన్నారు. ఎంఈవో రామచంద్రయ్య మాట్లాడుతూ పాఠశాలలో 4 ఐఎఫ్‌పీ ప్యానల్స్ తక్కువగా ఉన్నాయని చెప్పడంతో వాటిని వెంటనే పాఠశాలకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మానిటరింగ్ అసిస్టెంట్ ఆఫీసర్ యూనిస్‌బాషా, హెచ్ఎం శ్రీనివాసరావు, సీఆర్పీలు శివకుమార్, ఓబులేసు, ఇమామ్‌హుసేన్, జావిద్ ఉన్నారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించాలి'

దొర్నిపాడు, జూలై 8: మండలంలోని దొర్నిపాడు జెడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. సోమవారం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలో ఆర్వోప్లాంట్, నీటి ట్యాంకులకు మరమ్మతులు చేయించి వెంటనే నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌శర్మ, రమణారెడ్డి, సుదర్శన్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వైభవంగా లయన్స్ క్లబ్ దినోత్సవం

బేతంచెర్ల, జూలై 8: పట్టణంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్ సమక్షంలో బేతంచెర్ల లయన్స్ క్లబ్ సభ్యులు వైభవంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీకాంత్, రవిప్రకాష్, భవనాశి నాగా మహేష్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అనాథలు, పేదలకు సేవలందిస్తున్నామని అన్నారు. లయన్స్ క్లబ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లారీ, మోటారు సైకిల్ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

బేతంచెర్ల, జూలై 8: బేతంచెర్ల-కర్నూలు రహదారిలోని గోరుమానుకొండ మలుపు వద్ద ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో లారీ మోటారుసైకిల్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి జరిగినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసూమ్ సోమవారం సాయంత్రం తెలిపారు. మండలంలోని సీతారామాపురం గ్రామానికి చెందిన నల్లబోతుల వెంకట్రాముడు తన పని నిమిత్తం బేతంచెర్ల వైపు మోటారు సైకిల్‌పై వస్తుండగా.. బేతంచెర్ల నుంచి నాపరాళ్ల లోడుతో ఎదురుగా వస్తున్న లారీ మోటారు సైకిల్ ఢీకొన్న సంఘటనలో వెంకట్రాముడుకి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. బాధితున్ని బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. బాధితుడి భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

నంద్యాల, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి సోమవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: రాష్ట్ర ప్రజలకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని మండల వైసీపీ కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా సోమవారం ఉయ్యాలవాడలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైసీపీ నాయకులు పోచా రాధాకృష్ణారెడ్డి, శివానందరెడ్డి, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని వైసీపీ కార్యాలయం ఆవరణలో సోమవారం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, క్రిష్ణమూర్తి, బోరెడ్డి రాము, శ్రీనివాసరెడ్డి, బషీర్, కొండయ్య పాల్గొన్నారు.

చాగలమర్రి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని వైసీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం చాగలమర్రిలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీపీ వీరభద్రుడు, ఉప సర్పంచ్ సోహెల్, వైసీపీ నాయకులు రమణ, గణేష్ రెడ్డి, గేట్లమాబు, ముల్లా రఫీ పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో వై ఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి

శిరివెళ్ల, జూలై 8: వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా శిరివెళ్లలోని మోడల్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి సోమవారం అవగాహన కల్పించారు. రాబోయే నాలుగు నెలలు చాలా కీలమని.. నవజాత శిశువులు, చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో మూడు మలేరియా కేసులు, 116 డెంగీ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, పీహెచ్‌సీ వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ అమీనాబీ, పాఠశాల ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రవరం: సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు వైద్యాధికారి అమర్‌నాథరెడ్డి సోమవారం సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

ఉయ్యాలవాడ: సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య సూచించారు. సోమవారం 80 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో దస్తగిరి ఉన్నారు.

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామంలో వైద్యులు సుల్తాన ఆధ్వర్యంలో సోమవారం సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, డయేరియా నివారణపై విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు కలిసి వీధుల గుండా ర్యాలీ చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో చంద్రకళ, ఏఎన్ఎం వేదమని, హెచ్ఈ మనోహర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బేతంచెర్ల, జూలై 8: మండలంలోని గూటుపల్లె గ్రామంలో వడమూరి రాజు(24) అనే కామెర్లతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు మూగ(మాటలు రావు). మృతునికి సమీపాన ఎవరూ లేనందున చుట్టుపక్కల వారు మృతుడి అంత్యక్రియలు నిర్వహించాలని ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూరు బాషాను కోరారు. ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చి గూటుపల్లి శ్మశాన వాటికలో మృతదే హానికి అంత్యక్రియలు నిర్వహించారు. సంస్థ సభ్యులు లక్ష్మీరా ఘవ, అక్బర్, మబాషా పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారమే ధ్యేయం'

నంద్యాల, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మున్సిపాలిటీలోని ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయమని కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వీటిని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం

బనగానపల్లె, జూలై 8: మండలంలోని పాతపాడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు షర్ఫుద్దీన్‌ను గ్రామ సర్పంచ్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యా కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకల పంపిణీ

బనగానపల్లె, జూలై 8: పట్టణంలోని కస్బా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విష్ణు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోడుదుల పుల్లారెడ్డి విద్యార్థులకు ఉచితంగా పలకలు, పెన్నులు ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. దాతను ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు సుంకన్న, నాగేంద్రారెడ్డి, విక్రమ్‌రెడ్డి, గుండం విజయనాగేశ్వరరెడ్డి, సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

సంజామల, జూలై 8: రైతులు తమ భూముల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి కోరారు. విస్తారవంతమైన భూముల్లో భూ పరీక్షలు చేయించి సేంద్రీయ ఎరువులను వాడాలన్నారు. రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై కందుల విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు.

గురప్ప స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూలై 8: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో కొలువుదీరిన గురప్పస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.